# దారి తప్పిన యిద్దరు మనుషులు

ఆరోజు అప్పయ్యను నిలదీసి అడిగేసింది పెళ్లాం రత్తమ్మ. విషయం ఓ దారికి రావల్సిందేనని.

పొద్దుటే గొడ్లసావిడి పన్లూ, కావిడేసుకుని వూరి బయట చెరువు, గిలకబావి నుండి, గొడ్లసావిడి గాబుల్లోకి, యింటి వాడుక్కి, తాగేందుకూ బిందెల్లో నీళ్ళు నింపి, యింకాసిని కూసిని చిల్లరపన్లు చూసుకుని, చద్ది బువ్వతిని, గోనె పట్టాలో చుట్టిన లంక పొగాకు కాడలుతీసి ఓ సుమారు చుట్ట చుట్టుకుని, యింకో నాలుగు కాడలు బొడ్లో దోపుకుని, వూళ్ళో విశేషాలు ఎట్టెట్టా వున్నాయో కాస్త చూసొద్దామని, అట కాలెత్తి ఓ అడుగన్నా, సొంతం వేయకతలికే, ఎంత పెళ్లామైనా మాట తీరుతప్పి, కాస్త పెళుసుగా తన్నావజాన నిలవేయడం, సుమారు కాయబారు మనిషైన అప్పయ్యకు బొత్తిగా గిట్టలేదు.

"ఇదిగో" అప్పుడే యాడికో బయలెల్లేవే. వూళ్ళో జనాన్ని సొంతం లెగవ నీకుండానే!" అడిగింది రత్తమ్మ.

"అవున్లే, నీకు తెల్లారింది. మనూళ్ళో ఎవురికి మటుకు ఎట్టా తెల్లారుద్దీ? అట్టాటిది జరగడం నేనెరగను'' అన్నాడు అప్పయ్య, మాటకాస్త తూకంగా లేకబోతే సిక్కులుంటయ్యనుకుంటా.

"అబ్బో, ఎరక్కనా! మా బాగా ఎరుగుదును కాపరానికొచ్చిన కాణ్ణుంచి! లోకంలో యాడన్న ఏ మొగుళ్ళైనా తెల్లారి లెగవంగానే ఓ పెళ్లాం, బిడ్డలంటూ ముంగల చూసుకుంటారు. అదేందో మరి. మనకి తెల్లారిందంటే వూళ్ళో ఎక్కడ కాళీ అరుగులుంటే ఆడకెల్లి కూకుని, వొచ్చి పొయ్యే జనాన్ని గుడ్లు మిటకరించుకుంటా చూడంది, ఆరోజు మనకి కటిక లంకణమాయె!'' అన్నది రత్తమ్మ, మొండికెత్తకపోతే యవారాలు తేలవనుకుంటా.

"నువు నా కళ్ళ ముంగలవుంటే సాల్దంటే, యాడో అరుగులమీద కూకుని ఏడుస్తానంటావు! యియ్యాల తెల్లారే లంగిచ్చు కుండావు. అసలు యిసయమేందో బయటకు రానియ్" అన్నాడు అప్పయ్య. తెల్లారే పెళ్ళాలకాడ పేసీలు రావటం ఎప్పటికీ మంచిది కాదనుకుంటా-

తాడెత్తు మనిషి సప్పున తగ్గిపోయి, యిషయం ఏమిటని యిశారించడం కనిపెట్టిన రత్తమ్మ ఎంటనే గోడకానుకున్న నులక మంచాన్ని వాల్చి, అప్పయ్యను కూకోబెట్టి తను వసారా స్తంబానికి ఆనుక్కూకుని, యిషయాన్ని బయటకు లాగింది.

"సెన్నా పట్టణంలో మనపిల్లోడు నారాయణ, పెద్ద ఇంజనీరుగా కాపరం చేస్తుండాడని, మాటవరసకు సిన్ననలుసంత ఏనాడైనా నీకు అనిపిచ్చుద్దంటయ్యా!" అడిగింది రత్తమ్మ.

"తెల్లారి లేసినప్పట్నుంచీ ఎక్కడో, ఎందుకో, అదేపనిగా గుంజుతా వుంటే, ఏంటైంది తెలవక, మదనపడి సచ్చా! అయితే యియాల సెన్నా పట్టంలో నారాయణ పూనకంలో కొచ్చాదన్నమాట. ఆ మద్య ఐద్రాబాదులో వుండ పెద్దకూతురు నాగరత్తం, అంతకు ముంగల యిశాక పట్టంలో వుండ సిన్న కూతురు సీతాం, వరసగా పూనుకుంటా వచ్చారు. యియాల నారాయణ వంతు" అన్నాడు అప్పయ్య.

"పూనకాలంటూ యిసయాన్ని మడతపెట్టడం దేనికీ, పెళ్ళాం బిడ్డలంటే గిట్టదంటే సరిపోద్దిగా. లోకంలో బిడ్డలు కన్న ఏ మనుషులకైనా ఆళ్ళంటే పానం పీకుద్ది. పిల్లలుండా లేనట్టు మనము వుండాం రెండు తాళ్ళల్లే. యీ వూరికి అతుక్కుబోయి, ఎందుకుబోతూ. నారాయణ ఉత్తరాదిలో వున్నన్నాళ్ళు, అబ్బో సానా దూరం అంటివి! ఇప్పుడు సెన్నా పట్టనానికి బదిలీ అయినాక, పెద్ద బంగళా, కొత్త కారూ, నౌకర్లూ అన్నీ యిచ్చారంట ఆడికి! కాస్త ముచ్చటకయినా ఆళ్ళను చూడాలని, నీకేనాడైనా అనిపిచ్చుద్దంటయ్యా?" అడిగింది రత్తమ్మ.

"అనిపిస్తే నీకు సెపుతారెట్టా" అన్నాడు అప్పయ్య.

"అయ్యోరామ! నీ మనసులో మాట ఓనాడు నేనెరుగుదును గనకనా, యీనాడు నువు సెప్పలేదనుకుంటానికి! యీ పెద్దతనంలో గొడ్డూ గోదా, యవసాయం పెట్టుకుని కాలో సెయ్యో పడిపోతే దిక్కూ మొక్కూ లేకుండా, మనం ఒకళ్ళం యీడ దిగపడుండటం నారాయణకు బొత్తిగా గిట్టటంలేదు, కిందటిసారి యీడకొచ్చినప్పుడు నాతో సాటుగా, యీ యిసయం గెట్టిగా సెప్పి పొయ్యాడు. ఈడమిగిల్న కాస్త కూస్తె తెగనమ్మి, సెన్నపట్టం రామంటున్నాడు" అన్నది రత్తమ్మ.

"అవున్లే! నువు యవహర్తవు కనుక అయన్నీ వాడు నీతోనే మాట్లాడ్తాడు మరి నేనీడ వుండది, ఉత్త దిష్టిబొమ్మనేగా! యిన్నాలూ యీ యవసాయంమీద బతికాం, ఆళ్ళ సదువులూ, ఆళ్ళ పెళ్ళిళ్ళూ, ఆల్లాటలూ యియాలిదాకా యీడ, యీ అప్పయ్య యవసాయం చేస్తావుంటేనే సాగినై. యియాల వాడు పెయోజకుడు! సెన్నాపట్టంలో అంతలావు ఇంజనీరాయె! వాడిమాట యియాల అందరికీ గెట్టిది. వుండదంతా తెగనమ్మ మంటే కాదంటానికి ఎవురి కెన్ని గుండెలుండయ్! అసలు నీ యవారం నేను కనిపెడ్తానే

వుండాగా; నారాయణ వాళ్లు సెన్నాపట్టం సేర్నప్పట్నుంచీ నువు రాగం మొదలు పెట్టటం నేనెరగనంటా-" అన్నాడు అప్పయ్య.

"ఆ రాగాలేందో నీకే దెలవాల! ఉత్త పున్నానికి నన్నన మాక మాటకు ముంగల. అసలు నీతో ఓ మంచీ సెడంటూ మాట్టాట్టవే పెళయమైతే, ఎట్టా అందుకే నారాయణ యీ యవారాలన్నీ నాకాడకొచ్చి చెబుతా వుంటాడు. నాకొద్దుమొర్రో అంటుండా! వూళ్ళో యాడకెళ్ళినా నిచ్చేపంగా కొడుకు సెన్నాపట్టంలో అంతలావు ఇంజనీర్రై మిమ్మల్ని ఆడకొచ్చి వుండమంటుంటే, మీ పెద్దోళ్ళకేమైనా సేదా? అని ముక్కు మీన ఏలేసుకుంటుండారు" అన్నది రత్తమ్మ.

"నువ్వెళ్ళు సెన్నపట్టం! ఆ నారాయణకు నువంటేనే గురి. నా మాటంటే ఆడికి గిట్టదు" అన్నాడు అప్పయ్య విరగదీసినట్టుగా.

"ఆ సెన్నాపట్టం అంటే నేనేం నాలుక పీక్కుసావటంలా. యిదిగో, నీ బాగోతం నాకు బాగా తెల్సు. నిన్నొక్కణ్ణీ యీడ యిడిసి పొయ్యేది లేనేలేదు. ఎల్తే యిద్దరం ఎల్లాల్సిందే! ఆ మాటకొస్తే కోడలు రామలచ్చికి నా మాటంటే అంతకన్న లెక్కలేదు. అయినా తప్పుద్దా?" అన్నది రత్తమ్మ.

"ఆ సెన్నపట్టం మనుసులే వేరు. ఆరి బాస తెల్సిసావదు. ఆ పట్టం బతుకే మన పల్లెటూరోళ్ళకు వూపిరి సలపకుండా గజిబిజిగా వుంటది. సివరికి ఇక చేసేదేందో తెలవక వాడి బంగళాలో నారాయణకు ఎడమొగంగా నువూ నేనూ కూసుని వొకర్ని చూసి యింకోరు బుసలు కొట్టుకుంటా, ఏందే నువూ నేనూ సెన్నాపట్టం ఎల్లి చేసేదీ? ఇదిగో. నేనీడ పుట్టిపెరిగా, యీణ్ణుంచి కదల్ను" అన్నాడు అప్పయ్య.

"కదలద్దు, యీడే కూసుందాం. మూలుగుతా వొకర్నొకరం చూసుకుంటూ! ఎనక బాగా ఆస్తి వుండేదినాల్లో మీసం మెలేసుకుంటా తిరిగావు. బాగుంది. యియాల ఆ ఆస్తి తరిగిపోయిందే మరి. ఆ వుండది పట్టుకు వేళ్ళాడ్డానికి సొంత యవసాయం నీవల్ల అవటంలేదని నువే అంటుంటివిగా! లాబంలేని యవసాయం చేసేదానికన్న అదంతా అమ్మేసి బాంకిలో ఏసుకుంటే సచ్చేంత వచ్చుద్దంటాడు నారాయణ. రోజులు మారటం మనం కూడా చూడాలి మరి. మనపిల్లోడు చదువుకుని గొప్పోడయ్యాడు! వాడు చదువుకోక యీ యవసాయం అంటూ యీ పల్లెటూళ్ళో పడుంటే మనకున్న ఆస్తి సాలక, ఎవురి పొలాలన్నా చేసుకుంటూ పాలేరుగా బతకాల్సొచ్చేది. వాడు బుద్ధిమంతుడు కనుక బాగా పైకొచ్చి, మనల్నొచ్చి ఆళ్ళకాడ వుండమంటున్నాడు. కన్న తల్లిదండ్రులకు అంతకన్న యింకేం కావాలో నువే చెప్పు. నీకు తెలవదుగాని, మనమంటే నారాయణకు సానా గౌరవం వుండది" అన్నది రత్తమ్మ.

* * *

సెన్నపట్టం టేసనులో రైలుబండి సొంతం ఆగకుందానే కొడుకు నారాయణ, కోడలు రామలచ్చీ వెతుక్కుంటూ వచ్చేలోపలే, అప్పయ్యా రత్తమ్మలు గెట్టిగా పట్టుక్కూసున్న సామాన్లను ప్లాటుఫారం మీన అప్పటిదాకా మోకాలితండ వేసుక్కూసున్న 'లైసెంచు' కూలీలు రైలు పెట్టిలోకి ఎగ్గిరి దూకి, తలో సామాను పీక్కుబోయి తోపుడు బళ్ళమీద గిరవాటు వేస్తుంటే, పెద్ద పొలికేక పెట్టిన అప్పయ్య, వాళ్ళమీద కలబడి తమ సామాను పీక్కుంటూవుంటే, రత్తమ్మ యీ కుమ్ములాటకు బిత్తరపోయి, అప్పయ్యను లాగుతూ వుంటం, వురుములు, మెరుపులు మెరిసినట్టు ఏది ఏమైందో తెలవకుండా యవహారమంతా గిజిగాడి గూడల్లే గజిబిజై అప్పయ్య నీరకాయ చొక్కా ఫర్రున చిరగటం రత్తమ్మ చీర చీలికలు పేలికలు కావడం అవనే అయిపోయింది.

"నేనొద్దంటున్నా యీడకు లాక్కొచ్చావు, సెన్నపట్టం యవారం ఎట్టా వుందంటా!" అన్నట్టు రత్తమ్మవేపు కొరకొర చూశాడు అప్పయ్య. పైపంచ టఫీమని జాడించి బుజానవేసుకుంటూ.

"నే నేపాపం ఎరుగను. మాటకు ముంగల నన్ను లాగమాక" అన్నట్టు రత్తమ్మ అప్పయ్యానో సూపు చూసేలోపల, వారి బాసతో లైచెన్సు కూలీలనో దారికి తెచ్చిన కొడుకూ కోడలూ వాళ్ళతో సామాను పట్టించుకుని టేసను బయటకు సాగారు.

"ఇందుకే ముంగల నీకోమాట సెప్పొంచాను. యీ పట్నాల దోరణి నాకు గిట్టదని" అని రహస్యంగా రత్తమ్మ సెవులో వూదాడు అప్పయ్య టేసను నుంచి నారాయణ కారు వుసిగా పోతుంటే–

* * *

త్యాగరాజనగర్లో కంపెనీ వారిచ్చిన పెద్ద బంగళాలో వుంటున్నాడు అప్పయ్య కొడుకు నారాయణ. కొత్త కారుంది. డ్రైవరుండాడు. ఆడా మొగా యిద్దరు పనిమనుషులందారు నారాయణున్నాడు. కోడలు రామలచ్మి వుంది. యిద్దేరు మొగ, వొకాడపిల్లలుండారు. బయట జనం వస్తా పోతావుంటారు. వారికి టీవీ సినిమా వుండది, రేడియోవుండది, ఐసుపుట్టించే "పిజిడేరు" వుండది. ఎక్కడి కక్కడ వెలట్రీదీపాలు, పంకాలుండయ్, సోఫాలు కుర్చీలుండయ్, ఇంటికి ముంగల ఎనకమాల అక్కడక్కడ కుంపట్లలో మనగాడి జాతిపూలమొక్క లుండయి. వీటన్నిట్నీ కొన్నాళ్ళు మటుకే అట్టట్ట చూసిన అప్పయ్య, ఎక్కడో ఏదో జార విడుసుకున్న మనిషల్లే బంగళాలోంచి వీధిలోకి, వీధిలోంచి బంగళాలోకి, మగ్గంలో కండె కొట్టుకుండట్టు అటూ ఇటూ తిరగటం మొదలుపెట్టాడు.

అక్కడ వీధిలో అరుగులు లేవు. ఎందుకు అరుగులు వుండనియ్యరో అప్పయ్యకు తెలియలేదు. వీధిలో మనుషులు తిరుగుతుంటారు. కానీ నిలబడరు. నిలబడ్తే మాట్లాడరు. మాట్టాడితే బాస అర్థం కాదు. రిక్షాలొస్తయి, కార్లొస్తయి. అందులో మనుష లెవరయిందీ తెలవదు.

ఎండి, నెర్రలిచ్చిన చెరువులో వానసినుకులుపడి, తడి తగిలేతలికి కప్పలు బెకబెకమన్నట్టు, ఒకరోజున అప్పయ్యకు ఆ వీధిలో మూడు బర్రెగొడ్లు అగుపించి పానం లెగిసొచ్చినట్టయింది.

అవి చూడి బర్రెలని ఎంటనే తెలుసుకున్నాడు అప్పయ్య. ఎక్కణ్ణుంచో ఆ వీధిలోకొచ్చి తోకలాడించుకుంటూ మేస్తున్నాయి! అక్కడ పచ్చిగెడ్డి అగుపించటం లేదు. నలిపి పారేసిన సెత్త కాగితాలు సానా అగుపిస్తున్నాయి! ఆ వీధిలో ఆ సెత్త కాగితాల్ని తోకలాడించుకుంటూ తింటున్నాయి, ఆ బర్రెగొడ్లు. తుబుక్కున వుమ్మూసి అక్కణ్ణుంచి లెగిసెల్లాడు అప్పయ్య.

ఇంకొన్ని దినాలకి ఆవీధికి దగ్గర్లో వున్న పెద్ద బజారుకు వెళ్ళడం మొదలుపెట్టాడు అప్పయ్య. ఆ బజార్లో దారెపొయ్యే మనుషులు అడ్డగోలుగా నడవకుండా వుంటానికి, ఆరంగుళాల మందాన సిన్న రోడ్లు “పేమెంటులు” బజారుకు రెండు పక్కలా వుండయి. ఆ పేమెంట్ల మీద అక్కడక్కడ పెద్ద చెట్లు, ఒకటి రెండు బీడీ దుకానాలుండయి.

అయినా చూద్దామని “పుగాకేమన్నా వుండదంటయ్యా” అని అప్పయ్య అడగంగానే “యిల్ల” అన్నాడా దుకానం మనిషి బాసలో.

తను కాస్త జాగర్త మనిషి గనక, యీ సెన్నాపట్టాన్ని నమ్మేదెవురని, వూర్నించి వొచ్చేప్పుడే కాస్తె గనంగా పుగాకు తెచ్చుకుండాడు అప్పయ్య.

రెండు సోడాలు తాగాడు అప్పయ్య. గ్యాసు బొత్తిగా లేదు! గోలి తుస్సున లోనికిపోయింది; సిసలైన గోలీసోడాకొడ్తే, మైలుదూరం యినిపిచ్చుద్ది!

రోజూ అక్కడ పేమెంటు మీద ఓ పక్కగా చెట్టుకింద చుట్టకాల్చుకుంటా కూచుని, వొచ్చే పొయ్యేరద్దీ, రకరకాల మనుషులూ, వారి బాసలూ వింటూ, దినాలు గడుపుతున్న అప్పయ్య “తన బతుకు యింత సెందాలమైందే!” అనుకున్నాడు, ఓ రోజున.

* * *

ఆ రోజు తను మామూలుగా కూచునే “పేమెంటు” మీద చెట్టుకింద నుంచి ఎదురు “పేమెంటు దగ్గిర బస్సులు ఆగే స్టాపింగుకి కొంచెం పక్కగా, యింకో బీడీ దుకానానికి దగ్గిరగా చెట్టుకింద కూచున్న ఆ మనిషిని వింతగా చూశాడు అప్పయ్య కన్నార్పకుండా.

బజార్లో అటూ ఇటూ వుసిగా "రయిరయిన" పొయ్యేకార్లను తప్పించుకుంటూ, మంత్రకట్టువేసి లాగినట్టు, అవతల పేమెంటు, ఆ చెట్టుకింద కూచున్న ఆ మనిషి దగ్గిర కెళ్ళి నుంచుని పరీక్షగా చూశాడు అప్పయ్య.

మాసిన తలగుడ్డ, మోకాళ్ళ పైకెగ్గట్టిన పంచ, సగం నెరిసిన వాలిన బొద్దు మీసం, సుమారు అరవై ఏళ్ళుండే ఆ నల్లటి మనిషి, ఆడీడ తోలుముక్కలూ, రబ్బరు టైరుముక్కలూ, పాచ్చెప్పులూ పడుంటే, వాటికి మధ్యగా తలవొంచుక్కూసుని చెప్పులు కుట్టుకుంటున్నాడు.

"ఏవూరు?" అడిగాడు అప్పయ్య.

తలెత్తి ఎదురుగ్గా తాడల్లే నుంచున్న అప్పయ్యను ఎగాదిగాదిగాసూస్తూ "ఒంగోలు దెగ్గిర, మాదిగపల్లి" అన్నాడా మనిషి.

"తెలుగు మాట్లాడ్తుండావే? నీ పేరేంటేం?" అడిగాడు అప్పయ్య.

"నేను తెలుగోణ్ణియ్యోవ్; మన బాసల్లే యీడ బాస నాకంత ఎక్కలేదు. నా పేరు రామయ్యలే" అన్నాడా మనిషి.

"నువు తెలుగోడివని అదుగో అటేపునుంచి చూస్తావుంటేనే తెలిసింది; అందుకే యిటొచ్చా! యీడ సెన్నాపట్టంలో వుండ తెలుగోరు కొత్తగా వచ్చిన తెలుగోర్ని పలకరిచ్చరా, ఏందీ' అక్కడక్కడ మనోరెవురైనా కనపడ్తే కాసేపు కూకుని మాట్టాడ్దామని నాలిక పీక్కుంటున్నా, ఎవరూ దగ్గరికి వచ్చిసావందే!" అన్నాడు అప్పయ్య.

"నువు ఎవురివో! వాలకం సూత్తే సెన్నాపట్టానికి కొత్తగా వచ్చినట్టుందే? మన తెలుగోరికి, యింకే దేశం మదుసులైనా గొప్పోరని గెట్టి నమ్మకం వుండదిలే! పైగా నిన్ను సూత్తే యిప్పుడే యగసాయం సేత్తా వొచ్చినట్టుంటివి, మరి యీడ మదుసులేం పట్టించుకుంటారు? నీ పేరేంటో?" అడిగాడు రామయ్య.

"అప్పయ్య" అన్నాడు అప్పయ్య, రామయ్య పక్కనే కూచుంటా.

* * *

ఆ రోజు నుండి అప్పయ్యకు, ఆ పేమెంటు మీన చెట్టుకింద రామయ్యను చూడంది నిదరపట్టేదికాదు, తనకు మాదిగ రామయ్య వొచ్చిన్నంత దగ్గిరగా కొడుకు నారాయణ, కోడలు, మనుమలు, మనుమరాలు ఎందుకు రాలేదో అప్పయ్యకు తెలియలేదు.

సెన్నాపట్నం వొచ్చిన్నప్పట్నుంచీ కొడుకు నారాయణింట్లో అప్పయ్యకు పుటకతో అలవాటైన చద్దెన్నం తినటం సంకటమైంది, పట్నంపోకడకు అలవాటు పడిన కొడుకింట్లో, ఏ మూలో కాస్త కాళీ చూసి, జాగర్త పెట్టిన చద్దెన్నం అప్పయ్యకు పెట్టేది పెళ్ళాం రత్తమ్మ.

"మెడ్రా సొచ్చినా చద్దన్నంతింటం మామయ్య త్యాగం చేయలేదే!" అని నవ్విందో రోజు, కోడలు రామలచ్చిమి.

ఇంకోరోజున యిద్దరు మనుమలూ, మనుమరాలూ పొద్దున్నే వంటింటో ఓ మూల చద్దెన్నం తింటున్న అప్పయ్యకు వెనకవేపుగా వచ్చి "నువు టిఫిన్ తింటున్నావా తాతయ్యా?" అని పెద్దగా అరిచి, పరిగెత్తుకెళ్ళారు.

వెలట్రీపంకా గాలి గిట్టని అప్పయ్య గాలి బిగదీసిన గదిలో ఓ మూల ఓ మధ్యాన్నం చుట్టతాగుతూ, ఆ పొగమైకంలో రకరకాల ఆలోశనల్లోపడ్డ సమయంలో, ఎందుకో ఆ గదిలోకొచ్చిన ఆ మనిషెవురో, దళసరిగా పేరుకున్న ఆ ఘాటువాసన సూటిగా మెదడుకెక్కి, అక్కడికక్కడే 'భళ్ళున' కక్కి, ఎంటనే ఎళ్ళిపోయింది, ఎవరైందీ తెలవకుండానే.

ఈ రకమైన యవారాలు ఎదురైనప్పుడల్లా పెళ్ళాం రత్తమ్మవేపు ఓచూపు చూసేవోడు, అప్పయ్య.

* * *

"నువు సానా అదృష్టవంతుడివి రామయ్యా! యీ పెపంచకం ఎటుపడిపోతుండా నీకు సీమకుట్టినట్టుండక్కర్లా" అన్నాడు అప్పయ్య, తలవొంచుకొని చెప్పులు కుట్టుకుంటుండ రామయ్య దగ్గిరకొచ్చి నుంచుంటూ.

"అదేందో నువంటుంటే యింటన్నా! కూకో అప్పయ్యన్నా" అన్నాడు రామయ్య, తలెత్తి అప్పయ్యను చూస్తూ.

"తెలవకడుగుతాను, నీకు పెళ్ళాం బిడ్డలుండారా రామయ్యా?" అడిగాడు అప్పయ్య, కూచున్న కాసేపుటికి.

"మడిసన్న పెతోడికి ఆరంతా వుంటారనుకో!" అన్నాడు రామయ్య.

"నిజమేలే. మరే! ఏం లేదూ, పిల్లాజల్లా ఎవురైనా అక్కరకొచ్చారేమో ననీ, అడిగాలే" అన్నాడు అప్పయ్య.

"అదంతా నీకు దేనికిలేవయ్యా, అదో బాగోతం" అన్నాడు రామయ్య.

"గెట్టిగా చూస్తే నీ యవారం నాకు దెగ్గిరగా వుండదల్లేవుందే, రామయ్యా! యిదిగో యిటు చూడు, రామయ్యా. నేను నీ పెళ్ళాం బిడ్డల్ను గురించి అడుగుతున్నానంటే. నాకంటె యింకెవురైనా బాగుంటే, ఆళ్ళ యిషయం యినాలని వుంటదిగనక, అడిగిసూశాగానీ, యవారాలన్నీ తిరగదోడ్తున్నానని అనుకోబోకు రామయ్యోవ్!" అన్నాడు అప్పయ్య.

"అంత మాటెందుకులే. అప్పయ్యన్నా. నిన్ను సూత్తావుంటే నువెసువంటి వోడివైందీ తెలవదంటా. అసలు యిసయం ఏందంటే, యియాల్టిదాకా నువడిగినట్టు నా పెల్లాం బిడ్డల్ని గురించి యీ దెవరూ అడగలేదు. మా కులాన్ని బట్టి కూడా అది కొంతుంటుందనుకో!" అన్నాడు రామయ్య.

"కులం గొప్పదవుతే మనసు గొప్పదవుతుందా, రామయ్య? యీ దినం నా మనసు బొత్తిగా బాగుండక నీయిషయం అడిగాగాని, లేకుంటే అదీ అడగననుకో" అన్నాడు అప్పయ్య.

"వుంటానికి పెల్లాం, యిద్దరు కొడుకులు, నలుగు రాడపిల్లకాయలుండారుగాని సివరికి ఓరికోరికి కలిసిరాక, యవారాలు సెడి, ఇదిగో నే నీడకొచ్చి వొంటరి గోణ్ణయి వుంటండా" అన్నాడు రామయ్య.

"అబ్బో, సానాకత వుండదే! కొడుకులేమన్నా సేతికి అందొచ్చారా! సెప్పిన మాటింటారా?" అడిగాడు అప్పయ్య.

"అదెట్టాటిదో నే నెరగను. ఆళ్ళవల్ల మా కుటుంబం సెడిందని నే నననుగానీ, ఆళ్ళబుద్ది గెడ్డి తింటంలో మా కుటుంబానికి శని పట్టిందని నీ అట్టాటి పెద్ద మనుసులనుకుంటుండారు! మేం, అరిజనులం. ఎనకపడ్డ కులంవాళ్ళమని, యిద్దరు మొగపిల్లకాయలకూ డబ్బు కరుజులేకుండా గవర్నమెంటోరు సదువులు సెప్పిచ్చారు. ఆళ్ళిద్దరి అదురుష్టం బాగుండి, సదువుల్లో పైకొచ్చి, బొంబాయిపట్టంలో మంచి నౌకరీల్లోనే సేరారు – అంటే పెద్దోడు ముంగల సేరి, బుడ్డోణ్ణి కూడా ఆడ సేర్పిచ్చాడు" అన్నాడు రామయ్య.

"మరింకేం!" అన్నాడు అప్పయ్య.

ఏం వుంటదిలే, మరి ఆళ్ళిద్దరికి యింకా పెద్ద నౌకరీలైనై. అట్టా అయిన మరుసనాట్నించే మా మాదిగపల్లి మడుసులు గొడ్డుమాంసం తినేవోరల్లే ఆళ్ళ కళ్ళకి అగుపించారు! ఆ బొంబాయి పట్టం నుంచి రాటం సానాదూరమని మిసబెట్టి ఆళ్ళు, ఆళ్ళ పెల్లాలూ, పిల్లలూ మా మాదిగపల్లి రాటం మానేశారు. యీ యవారం అంతడితో ఆగక మేం ఆ బొంబాయి పట్టానికెల్తే అక్కడ మడుసుల్తో పొసక్క ఆళ్ళకు మాటొచ్చుద్దని సల్లగా కోడళ్ళతో వుత్తరమ్ముక్కోటి రాయించి పార్నూకారు! నా ఆడమడిసికి ఆళ్ళమీద బెమత తీరక, రేత్రిళ్ళు వొకటే మైన రాగాలు తీసి, బొంబాయి పట్టం ఎల్లి ఆ నాయాళ్ళ యవారం అంతుగనుక్కొస్తానంది. ఏల్తే, మక్కెలిరగొడ్తానన్నా. జనమసెడ! యిన్నాలు నాతో కాపురం సేసిన యీ సచ్చిందానికి నే నెక్కవా, కొంపకు సిచ్చుబెట్టిన ఆ దొంగనాయాళ్ళెక్కువా? నాకు తెలవకుండా ఓ రోజు సందు సూసుకుని, బొంబాయి

పట్టం ఎల్లిపోయింది. యీడ తేలనెవారం, ఏం దీవెడ ఆడికెల్లి ఎలగబెట్టేది? అక్కడేదో రగడ జరిగి నా కాడికి తిరిగొత్తే ఒల్లు సున్నం జేత్తానని ఎటుగానో లెగిసిపోయింది యదవ...!" అన్నాడు రామయ్య, తుపుక్కున వుమ్మూసి.

"ఎంతన్నాయం జరిగింది?" అన్నాడు అప్పయ్య, దిమ్మెరపోయిన మనిషల్లే.

"అన్నాయానికీ యిందులో ఏముండది, అప్పయ్యన్నా! ఆళ్ళు మా తోలు జనమనించి బయటపడ్డారు! లచ్చనంగా పెళ్ళాం బిడ్డల్తో బొంబాయి పట్టంలో గొప్పోరల్లేనే యీళ్ళూ బతుకుతుండారు. ఆళ్ళు మాకు పుట్టినోళ్ళు కాదనుకుంటే సరి – ఆళ్ళకే లోటులేదు" అన్నాడు రామయ్య.

"అట్టనుకుంటానికి యీల్లేదులే రామయ్యా! కాస్తె డబ్బయినా పంపిస్తానంటారా?" అడిగాడు అప్పయ్య.

"ఎవరు, ఆ యదవలా? యింత బాగవతం యిని సివరికి యిదంటయ్యా! నువనేది, అప్పయ్యన్నా. తెల్లారి లెగవంగానే కడుపుకింత పెట్టమని, బీడీముక్కల కేమన్నా కాస్తె సద్దమనీ ఆ నాయాళ్ళను నే దేబరిత్తానా? జనమసెడ! పదిమంది అట్టాటి నాయాళ్ళ మొగాన పారేత్తా, ఆ బీడీముక్కలు కొని" అన్నాడు రామయ్య చేతిలో పాచ్చెప్పు 'పెటీమని' నేలకేసి కొడ్తూ.

"రామయ్యా! నువు నాకన్న ఎయ్యిరెట్లు గొప్ప పుటక పుట్టావు! నీకున్న నీతిలో నూరోవంతు నాకున్నా, యిప్పుడు నే బతుకుతున్న దిక్కుమాలిన బతుకు బతకను. నేను నీకు, బతికిన మనిషల్లే కనిపిస్తుండా, నిజానికి సొంతం సచ్చిపోయిన అప్పయ్య నీకాడ కూసుని మాట్టాడ్తుండాడనుకో!" అన్నాడు అప్పయ్య అదోరకంగా చూస్తూ.

"నీకేమయ్యా! మారాజుబిడ్డవి. యీ పెద్దతనంలో దొడ్డ బతుకు బతుకుతుండ నీ కొడుకు, నిన్నూ నీ ఆడమడిసిని, ఏలోటూ లేకుండా సూసుకుంటుండాడంటే అంతకన్న యింకేం కావాలా?" అన్నాడు రామయ్య.

"బయట్నించి సూసేవోడికి అట్టనే వుంటదిలే రామయ్యా. యీడ సెన్నాపట్టంలో నా బతుకు సెర్లోంచి బయటపడ్డ సేపల్లే అయిందంటే, నువు నమ్ము! నా యిసయం ఒకేళ ఎవుర్తోనైనా చెప్పుకున్నా, అంత తేలిగ్గా అరదమయ్యేది కాదు. నేను పల్లెటూళ్ళో పుట్టి, ఆ గాలి తిని బతికిన మనిషిని. పల్లెటూరు మనుషులు పట్నాల్లో బతకటం లేదని నేననను. ఆళ్ళు సదువుకున్న మనుషులవటాన, పట్నాల్లోనే వారికి బతుకు తెరువులుంటయ్. అందుకే మా నారాయణ పట్నాలకు అతుక్కుపోయినాడు. పట్నాల రుసి, వాడూ, వాడి కుటుంబంలో పెతోరికీ లోతుగా యింకిపోయింది. మరి నాకా రుసి తెలవదే? ఏ రకంగా చూసినా వారితో నేనతకటంలా. నా ఆడమనిషికి ఎక్కడున్నా బాగనే వుంటది. పిచ్చి

సచ్చింది! తెల్లారిలేస్తే నే నాయింటో వొంటరి గాణ్ణల్లే వుంటది! రేత్రిళ్ళు నేను మావూళ్ళో తిరుగుతుండట్టు రకరకాల కలలొస్తుండయ్, అదేంటో మరి! నేను సెన్నాపట్టం వొచ్చిన కాణ్ణుంచే యిట్టాటి కలలు రావటం వొకటేమైన తగులుకుండయ్, రామయ్యా! నేను తెల్లారి మసగసీకట్లో కావిడేసుకుని మావూరి సెరువు నుంచీ, గిలకల బావినుంచీ నీలు తెచ్చి మా యింటో బిందెలూ ఆటిల్లో పోస్తుండట్టూ, ఓరోజు పొలం గెట్లమీన సుట్ట కాల్చుకుంటా తిరుగుతుండట్టూ, రెండెడ్ల బండి మీన వడ్లబస్తాలేసుకుని, దుమ్ములెగుపుతా ఎద్దుల్ని ఒకటేమైనా దౌడు తీయిస్తా యింటికొస్తున్నట్టు, యింకొకరోజు నాట్లకాడా, నూర్పిళ్ళకాడా సుట్ట కాలుత్తా కూసుండట్టూ, రోజుకోరకంగా కలలొస్తుండయ్యంటే నువు నమ్ముతావా రామయ్యా? రేత్రిళ్ళు యీ రకంగా నేను మా వూరెళ్ళి వొస్తావుంటం పానానికి ఎంత సుకంగా వుండా, తెల్లారి లెగవంగానే చద్దన్నం తింటం, చుట్ట తాగటం పెద్దగండంగా తయారైందంటే, నమ్ము రామయ్యా. తెచ్చుకుండ పుగాకు అయిపోయింది. సిన్న సిన్న ముక్కలూ, కాడలూ, పొడి మిగిల్నయ్. ఆట్ని ఎట్ట చుట్ట సుట్టుకొని తాగాలో కుదరక పానం కడగట్టుండదనుకో రామయ్యా! నారాయణ పెద్ద వుద్యోగస్తుడాయిరి! తెల్లారంగానే 'యాడన్నా పుగాకు దొరుకుద్దేమో యిశారిచ్చి చూస్తావంట్రా?" అని ఎట్టగడమంటా, రామయ్యా? యీ మద్దెనించి కాళీ దొరుకుతే తప్ప, చద్దెన్నం తింటం సానాదాకా మానేశా. రామయ్యా, రెండు మూడు దినాల్నుంచి సందేలపూట కాక తగిల్నట్టు వుంటుండది, అందుకే కాదుగదా, రామయ్యా? మనిషనేవోడికి యవారాలిట్ట రాకూడదు. ఏమంటా రామయ్యా?" అన్నాడు అప్పయ్య మూడోద్యానం చేసుకుంటుండ మనిషల్లే.

"ఏం సెప్పటానికి బహు కష్టంగా వుంటది. అప్పయ్యన్నా!" అన్నాడు రామయ్య, సగం తాగిన బీడీ ముక్కోటి బయటికితీసి, ముట్టిస్తూ.

మర్నాడూ, అటుమర్నాడూ, రోజూ వస్తున్నట్టుగా ఆ పేమెంటు చెట్టుకింద కూచున్న రామయ్య దగ్గిరకు అప్పయ్య రాలేదు. ఆ రెండు రోజులు చేసుకుంటున్న చెప్పులపని మధ్య మధ్య ఆపి, మామూలుగా గెడకర్రల్లే – అప్పయ్య వచ్చే వీధి వేపు చూస్తూనే వున్నాడు రామయ్య.